# 60

# దేవుని శిక్ష మరియు కనికరము

## (యెషయా 63)

యెషయా ప్రవచనముల వలన 63వ అధ్యాయంలోని పదనిధి మనకు బాగా పరిచయమైయున్నదే. ఈ వచనాలు "నీతి," "ఆగ్రహము," "ఉగ్రత," "ప్రతీకారము," "విమోచన," మరియు "రక్షణ"ను మరొక పర్యాయము తెలియజెప్పుచున్నవి.

> నాటకంలోని చివరి సన్నివేశ భాగాన్ని, ప్రతీకార దినమును (ఈ అధ్యాయం విశదపరచుచున్నది). మనము గొర్రెపిల్ల ఉగ్రతలోను (ప్రకటన 6:15 నుండి.) దేవుని ఉగ్రత యనబడు ద్రాక్షాగానుగ త్రొక్కబడుటలోను (ప్రకటన 14:17-20; 19:15) సరిగ్గా దీని క్రొత్త నిబంధన ప్రతిరూపమును చూచి వెనుకంజవేస్తున్నాము. కానీ ప్రశాంత చిత్తముతో పర్యాలోచన చేసికొన్నట్లయితే మనము మన ప్రతిస్పందనను నమ్మకూడదని అది మనలను హెచ్చరిస్తుంది. సంపూర్తి పరిశుద్ధత విషయంలో సముచితమైన భావావేశముల గూర్చి మనకు ఏమియు తెలియదు.[1]

### దేవుని ప్రతీకారము గుర్తుచేయబడుచున్నది (63:1-6)

మనము దేవుని ప్రతీకారము గూర్చి పర్యాలోచన చేయాలని భక్తిపూర్వక భయమును కలుగజేయు ఈ వాక్యభాగములో మనము చివరిసారిగా సవాలు చేయబడుచున్నాము. మొదటి రెండు వచనాల్లో దేవునికి వేయబడుచున్న రెండు ప్రశ్నలున్నాయి. బహుశా ఈ ప్రశ్నలను ప్రవక్త తానే అడిగియుంటాడు, లేదా అవి యెషయా ప్రవచనాలను చదువుచుండిన వారి చేత అపేక్షింపబడిన ప్రశ్నలైయుంటాయి. ప్రతి ప్రశ్నకు తక్షణమే జవాబియ్యబడింది, అది కూడ ఒకే జవాబు. ప్రజలు చేసిన పాపమునకు ప్రతిఫలంగా ఇవ్వబడవలసిన దానిని ఇచ్చుచుండిన దేవుడు తానే, ప్రతీకారము చేయువాడును రక్షణకు కారణభూతుడునైన దేవుడైయుండెను.

దేవుని ప్రతీకారము "గంభీరముగా నడచుచు ... బలాతిశయముతో ద్రాక్షాగానుగను త్రొక్కుచు వచ్చుచున్న" ఒక సైన్యమును పోలిన అలంకార రూపంలో నివేదింపబడింది:

> రక్తవర్ణ వస్త్రములు ధరించి ఎదోమునుండి
>     వచ్చుచున్న యితడెవడు?
> శోభితవస్త్రము ధరించినవాడై గంభీరముగా నడచుచు
> బొస్రానుండి బలాతిశయముతో వచ్చుచున్న యితడెవడు?
> నీతినిబట్టి మాటలాడుచున్న నేనే
> రక్షించుటకు బలాఢ్యుడనైన నేనే.
> నీ వస్త్రము ఎఱ్ఱగా ఉన్నదేమి?
> నీ బట్టలు ద్రాక్షాగానుగను త్రొక్కుచుండువాని
>     బట్టలవలె ఉన్నవేమి?
> ఒంటరిగా ద్రాక్షాగానుగను త్రొక్కితిని, జనములలో

ఎవడును నాతోకూడ ఉండలేదు
కోపగించుకొని వారిని త్రొక్కితిని
రౌద్రముచేత వారిని అణగద్రొక్కితిని
వారి రక్తము నా వస్త్రములమీద చిందినది,
నా బట్టలన్నియు డాగులే.
పగతీర్చుకొను దినము నా మనస్సునకు వచ్చెను
విముక్తిచేయదగిన సంవత్సరము వచ్చియుండెను
నేను చూచి ఆశ్చర్యపడితిని
సహాయము చేయువాడొకడును లేకపోయెను
ఆదరించువాడెవడును లేకపోయెను
కావున నా బాహువు నాకు సహాయము చేసెను
నా ఉగ్రత నాకాధారమాయెను.
కోపముగలిగి జనములను త్రొక్కి వేసితిని
ఆగ్రహపడి వారిని మత్తిల్లజేసితిని
వారి రక్తమును నేల పోసివేసితిని.

"బొస్రా," ఎదోము దేశములోని ముఖ్య నగరములలో ఒకటి (వచనం 1), రాజు యొక్క రాచబాటలో ఉండెను. ఈ పేర్లు 34:6లో వలెనే, ఇశ్రాయేలుకును దేవునికిని చాలా కాలంగా ఉన్న శత్రువులను సూచించుటకు ఇక్కడ వాడబడినవి. ఈ నిర్దిష్టమైన ఉల్లేఖనములు దేవుని యెడలను ఆయన ప్రజల యెడలను అనవరతం నెలకొని ఉండిన అవినీతిమయమైన దేశముల శతృత్వమునకు నిలయమగుచున్నవి. ఆయన తన ప్రజలను వీటన్నిటి నుండి విడిపించునని దేవుడు వాగ్దానము చేయుచుండెను.

"శోభిత వస్త్రము ధరించినవాడై, గంభీరముగా నడచుచు ... బలాతిశయముతో వచ్చుచున్నవాడు" "నీతినిబట్టి మాటలాడుచు, రక్షించుటకు బలాఢ్యుడైన" మెస్సీయాయై యున్నాడని అర్థమగుచున్నది. తీర్పు తీర్చ వలసిన పని మరియు రక్షణకార్యము ఆయన మాత్రమే చేయు కార్యములై యున్నవి. దేవునిని మరియు ఆయన సంకల్పములను ఎదిరించుట వలన కలుగు భయంకరమైన పర్యవసానములు ఈ పేరాగ్రాపులో అతి స్పష్టంగా చిత్రీకరింపబడి యున్నవి.

రెండవ ప్రశ్నకు – "నీ వస్త్రము ఎర్రగా ఉన్నదేమీ?" (వచనం 2) – జవాబు 3వ వచనంలో మొదలై 6వ వచనం చివరి వరకు కొనసాగుచున్నది. నాలుగు అభిప్రాయములు నొక్కివక్కాణింపబడినవి: ద్రాక్షా గానుగ గూర్చిన అలంకారికం (వచనాలు 3, 6), దేవుని ఆగ్రహమునకు గల హేతువు (వచనాలు 3, 6), మెస్సీయా తానొక్కడే పనిచేయుట (వచనాలు 3, 5), మరియు ఆయన బృహత్కార్యము యొక్క ఫలితములు: "విముక్తి" మరియు "రక్షణ" (వచనాలు 4, 5).

5వ వచనం 59:16కు బహు దగ్గరగా సమానాంతరమైనదై యున్నది, దేవుడు వాగ్దానము చేసిన దానిని సాధించగలవాడు మెస్సీయా ఒక్కడే అని అక్కడ ఆయన గుర్తింపబడియున్నాడు. "ఆదరించువాడెవడును లేకపోయెను." గనుక "ఆయన బాహువే" రక్షణకలుగజేసినదని మరొకసారి చెప్పబడినది.

## దేవుని కనికరము గుర్తుచేయబడుచున్నది (63:7-14)

ఆ తరువాత, మనము దేవుని హృదయము ఎటువంటిదో చూడగలము. కచ్చితంగా, ఆయన ఉగ్రత గంభీరముగా పరిగణింపబడవలెను; అలాగని ఆయన ఉగ్రతయే చివరి మాట కాదు. ఆయన ఉగ్రత పాతనిబంధన వక్కాణింపనియు, ఆయన కృప లేక కనికరము క్రొత్తనిబంధన వక్కాణింపనియు కొందరు అభిప్రాయపడుచున్నారు.; కానీ ఇది రెండు నిబంధనలకు కూడ తప్పుదర్థము నిచ్చును! దేవుని ఉగ్రత మరియు ప్రేమ ఒకే స్వభావము యొక్క రెండు పార్శ్యములై యున్నవి. పరిశుద్ధ సత్యవేదము యందంతటను అవి నొక్కివక్కాణింపబడినవి. ఈ విభాగంలో, ఉగ్రత మరియు కనికరము ఆయన యొక్క దైవికమైన స్వభావంలోని అంశాలుగా బయలుపరచబడినవి. ఆయన ఇశ్రాయేలు విమోచనము నిమిత్తము మెస్సీయా ద్వారా తన కార్యమును చేయుచుండగా ఈ రెండునూ ప్రదర్శింపబడినవి.

> యెహోవా మనకు చేసినవాటన్నిటినిబట్టి
> యెహోవా కృపాతిశయమును యెహోవా స్తోత్రములను
>     గానముచేతును.
> తన వాత్సల్యమునుబట్టియు కృపాబాహుళ్యమును బట్టియు
> ఇశ్రాయేలుయొక్క వంశస్థులకు ఆయన చూపిన
>     మహాకనికరమును నేను ప్రకటన చేసెదను.
> -వారు నా జనులనియు అబద్ధములాడనేరని పిల్లలనియు
> అనుకొని ఆయన వారికి రక్షకుడాయెను.
> వారి యావద్బాధలో ఆయన బాధనొందెను
> ఆయన సన్నిధి దూత వారిని రక్షించెను
> ప్రేమచేతను తాలిమిచేతను వారిని విమోచించెను
> పూర్వదినములన్నిటను ఆయన వారిని ఎత్తికొనుచు
>     మోసికొనుచు వచ్చెను.
> అయినను వారు తిరుగుబాటుచేసి ఆయన పరిశుద్ధాత్మను
>     దుఃఖింపజేయగా ఆయన వారికి విరోధియాయెను
> తానే వారితో యుద్ధము చేసెను.

*Chesed,* అను మూల పదము నుండి ఉత్పన్నమైన "కృపాతిశయము," హెబ్రీ వాక్య భాగములోని 7వ వచనంలో మొదటిదియు చివరిదియునైన పదమై యున్నది. వారి అనుభవముల నుండి దేవుని గూర్చి యూదా ఏమి నేర్చుకొన్నది? ఆయన ఆది నుండి అంతము వరకు కూడ తన నిబంధన ప్రేమ గూర్చి మాటతప్పని దేవుడై యున్నాడు. ఆయన ఏర్పరచుకొన్న ప్రజలు ఆయనకు విరోధముగా తిరుగుబాటు చేసియున్నారు. ఆయనతో చేసికొన్న నిబంధన విషయంలో వారు విశ్వాసఘాతకులై ఆయనతో అసత్యముగా వ్యవహరించి యుండిరి. అలా అయినప్పటికి, దేవుడు మారలేదు. ఆయన తన వాగ్దానముల విషయంలో ఎల్లప్పుడు నమ్మదగినవాడుగానే యుంటున్నాడు. దావీదు దేవుని యెదుట తన పాపములను ఒప్పుకొనినప్పుడు ఈ ఆలోచన ఆయనకు ఎంతో గొప్ప ఓదార్పును కలుగజేసింది (కీర్తనలు 51). మనము ఆయన "కృపాతిశయము"పై ఎల్లప్పుడు ఆధారపడవచ్చును.

దేవునికి ఇశ్రాయేలు యెడల వారి చరిత్ర యందంతటను గల వైఖరిని వచనములు

8 మరియు 9 వర్ణించుచున్నవి. వారి యెడల ఆయన కలిగియుండిన "ప్రేమ" మరియు "కనికరము" నిలకడగా నిలిచియుండినవి. "వారి యావద్బాధలో ఆయన బాధ నొందెను" అను వాంగ్మూలము యేసును గూర్చిన ఒక వాక్యభాగమును మనకు గుర్తుచేయుచున్నది:

> మన ప్రధానయాజకుడు మన బలహీనతలయందు మనతో సహానుభవము లేనివాడు కాడు గాని, సమస్త విషయములలోను మనవలెనే శోధింపబడినను, ఆయన పాపము లేనివాడుగా ఉండెను. గనుక మనము కనికరింపబడి సమయోచితమైన సహాయముకొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనమునొద్దకు చేరుదము (హెబ్రీయులకు 4:15, 16).

10వ వచనం ప్రారంభంలో దుఃఖదాయకమైన సారాంశము ఇవ్వబడియున్నది: "అయినను వారు తిరుగుబాటు చేసిరి." ఇశ్రాయేలు చరిత్ర వారి పరిశుద్ధ దేవునికి విరోధముగా వారు చేసిన తిరుగుబాటుతో ముద్రవేయబడింది, మరియు వారు "ఆయన పరిశుద్ధాత్మను దుఃఖింపజేసిరి" (వచనం 10బి) "దేవుని పరిశుద్ధాత్మను దుఃఖపర్చకుడి; విమోచన దినము వరకు ఆయన యందు మీరు ముద్రింపబడి యున్నారు" అని పౌలు ఎఫెస్సు పట్టణములోని క్రైస్తవులను హెచ్చరించాడు (ఎఫెస్సీయులకు 4:30). పరిశుద్ధాత్మను ఒక వ్యక్తిగా విశదీకరిస్తూ యెషయా, "ఆయన వారికి విరోధియాయెను, తానే వారితో యుద్ధము చేసెను" అని పలికాడు (వచనం 10సి). వారు చేసిన తిరుగుబాటు మూలమున ప్రజలు దేవుని నుండి అన్యాక్రాంతమగుట ఒక భయంకరమైన పరిణామమై యుండినది.

> అప్పుడు ఆయన పూర్వదినములను మోషేను తన జనులను
>     జ్ఞాపకము చేసికొనెను.
> తన మందకాపరులకు సహకారియై సముద్రములో
>     నుండి తమ్మును తోడుకొనివచ్చినవాడేడి!
> తమలో తన పరిశుద్ధాత్మను ఉంచినవాడేడి?
> మోషే కుడిచేతివైపున మహిమగల తన బాహువును
>     పోనిచ్చినవాడేడి?
> తనకు శాశ్వతమైన ప్రఖ్యాతి కలుగజేసికొనుటకు
> వారిముందర నీళ్లను విభజించినవాడేడి?
> మైదానములో గుఱ్ఱము పడనిరీతిగా
> వారు పడకుండ అగాధజలములలో నడిపించినవాడేడి?
>     యనుకొనిరి
> పల్లమునకు దిగు పశువులు విశ్రాంతినొందనట్లు
> యెహోవా ఆత్మ వారికి విశ్రాంతి కలుగజేసెను
> నీకు ఘనమైన పేరు కలుగునట్లు నీవు నీ జనులను నడిపించితివి.

దీనికి తారతమ్యముగా, ఒకానొకప్పుడు ఇశ్రాయేలు ఎటువంటి మహిమ కలిగియుండెనో ఆ దినముల గూర్చి 11 మొదలుకొని 14 వచనములు చెప్పుచున్నవి: "అప్పుడు ఆయన పూర్వదినములను, మోషేను తన జనులను జ్ఞాపకము చేసికొనెను" (వచనం 11). ఎర్ర సముద్రమును రెండు పాయలుగా విభజించుట ద్వారా వారు ఐగుప్తులో నుండి కాపాడబడిన విషయాన్ని వారు జ్ఞాపకము చేసికొన్నారు (వచనాలు 12). వారు అరణ్యములో సంచరించుచుండినప్పుడు దేవుడు వారికి మార్గనిర్దేశనము నిచ్చుటకును వారిని కాపాడుటకును ఆయన చేపట్టిన చర్యలను కూడా వారు జ్ఞాపకము చేసికొన్నారు (ఉదాహరణ, ఆహారము

కొరకు మన్నాను సమకూర్చుట, పగలు మేఘస్తంభము క్రిందను రాత్రి అగ్నిస్తంభములోను వారిని నడిపించుట). దైవికమైన ఈ చర్యల ద్వారా, దేవుడు "తన నిమిత్తము శాశ్వతమైన ప్రఖ్యాతిని" మరియు "ఘనమైన పేరును" కలుగజేసికొన్నాడు. (నిర్గమకాండము 14:16-29 చూడుము.)

## దేవుడు, ఇశ్రాయేలు తండ్రి (63:15-19)

పరమునుండి చూడుము
మహిమోన్నతమైన నీ పరిశుద్ధ నివాసస్థలమునుండి
    దృష్టించుము
నీ ఆసక్తి యేది? నీ శౌర్యకార్యములేవి?
నాయెడల నీకున్న జాలియు నీ వాత్సల్యతయు అణగి పోయెనే.
మాకు తండ్రివి నీవే, అబ్రాహాము మమ్ము నెరుగక పోయినను
ఇశ్రాయేలు మమ్మును అంగీకరింపకపోయినను
యెహోవా, నీవే మా తండ్రివి
అనాదికాలమునుండి మా విమోచకుడని నీకు పేరే గదా.
యెహోవా నీ మార్గములను తప్పి తిరుగునట్లుగా
మమ్మును ఎందుకు తొలగజేసితివి?
నీ భయము విడుచునట్లు
మా హృదయములను నీవెందుకు కఠినపరచితివి?
నీ దాసుల నిమిత్తము
నీ స్వాస్థ్యగోత్రముల నిమిత్తము తిరిగి రమ్ము.
నీ పరిశుద్ధజనులు స్వల్పకాలమే దేశమును అనుభవించిరి
మా శత్రువులు నీ పరిశుద్ధాలయమును త్రొక్కి యున్నారు.
నీ పరిపాలన నెన్నడును ఎరుగనివారివలెనైతిమి
నీ పేరెన్నడును పెట్టబడనివారివలెనైతిమి.

వారు ఐగుప్తు దేశ బానిసత్వము క్రింద ఉన్న రోజుల్లో వారిని కనిపెట్టకొని యుండిన రీతినే, దేవుడు ఇప్పుడు వారి ప్రస్తుత పరిస్థితులను గమనించి తెలిసికొనవలెనని వారు ఆయనకు మొరపెట్టారు. యెషయా ఎన్ని బోధలు చేసినా, వారు చేసిన పాపమునుబట్టి దేవుడు వారిని శిక్షించుచుండెనని తెలిసికొనుటలో వారు విఫలులయ్యారు (వచనం 15).

"మాకు తండ్రివి నీవే" అని పలుకుచూ వారు దేవునికి విజ్ఞప్తి చేసారు. వారు దేవునిని "మా తండ్రి" అని రెండు పర్యాయములు పిలుచుచున్నట్లు 16వ వచనంలో చూడగలము. "తండ్రి" అను పేరు ఆయనకు పాత నిబంధనలో యింకా ఆరు పర్యాయాలు మాత్రమే అన్వయింపబడినది.[2] ఆయన కుమారుడైన, యేసు రాకడతో, దేవుని పితృత్వము మరి ఎక్కువ సుస్పష్టము గావింపబడినది. ఈ వాస్తవమును ఇశ్రాయేలు "జాతి" గుర్తించలేకపోయినది, కానీ ఆధ్యాత్మిక "ఇశ్రాయేలు" గుర్తించును!

దేవుని మూలముననే వారు సమస్యలు ఎదుర్కొనుచున్నారను నిందను ప్రజలు దేవునిపై మోపినట్లగుపించుచున్నది: "యెహోవా, నీ మార్గములను తప్పి తిరుగునట్లుగా మమ్మును ఎందుకు తొలగజేసితివి? నీ భయము విడుచునట్లు మా హృదయములను నీవెందుకు కఠినపరచితివి?" (వచనం 17). ఏది ఏమైనా, ఆయన చిత్తము యొక్క కార్యసార్థకత

ఇందుకు ఒక కారణమన్నట్లు ఇక్కడ కనబడుచున్నది. ఫరో హృదయము దేవునికి విరోధముగా కఠినమగుట, ఆనాటి సందర్భములో "హృదయ కాఠిన్యము"నకు ఒక వేరు పదము ఉపయోగింపబడినప్పటికిని, అది ఒక విలక్షణమైన రూపావళియై యున్నది. "నా ప్రజలను పోనిమ్ము" అనునది దేవుని ఆజ్ఞయై యుండెను. అందుకు ఫరో నిరాకరించినప్పుడు, అతని హృదయము కఠినమైపోయింది గనుక దాని పరిణామములను ఫరో అనుభవించాడు. అదే విధంగా ప్రవక్తయైన యెషయా ఇచ్చుచుండిన ప్రోత్సాహక ఉద్బోధలను ఇశ్రాయేలీయులు నిరాకరించారు, గనుక తత్ఫలితంగా వారి హృదయాలు కఠినమైపోయాయి. అలాంటప్పుడు దేవుని నిందించుట నిరర్థకమే గనుక వారు ఆ పని చేయకూడదు, వారి ఎంపికల గూర్చి ప్రజలే బాధ్యత వహించాలి. దేవుని చిత్తమును ధిక్కరించువారి గూర్చి 6వ అధ్యాయంలో యెషయా ఇచ్చిన పిలుపు ఈ ఫలితాన్ని ముందుగానే తెలియజెప్పినది.

దేవాలయము ప్రజల అధీనములో అతి తక్కువ కాలముండుటనుబట్టి (వచనం 18) మరియు వారు దీర్ఘకాలము అనుభవించుచుండిన అన్యాక్రాంతమును బట్టి వారు విలపించారు. వారు దేవుని పేరు ఎన్నడును పెట్టబడనివారితో తమ్మునుతాము సమానులుగా పరిగణించుకొన్నారు (వచనం 19).

---

సూచనలు

[1]J. Alec Motyer, *The Prophecy of Isaiah: An Introduction & Commentary* (Downers Grove, Ill.: InterVarsity Press, 1993), 509. [2]ద్వితీయోపదేశకాండము 32:6; కీర్తనలు 89:26; యెషయా 9:6 (ఈ రిఫరెన్సులలో "నిత్యుడగు తండ్రి" మెస్సీయా గూర్చిన ఉల్లేఖనమై యున్నది); 64:8; యిర్మీయా 3:4, 19. మలాకీ 1:6; 2:10లో దేవుడు తండ్రిగా ఎలా పోల్చబడియున్నాడో కూడ చూడుము.

---

# వాక్యభాగాన్ని బోధించుట

**ఎడ్డీ క్లోయర్**

---

## ❖❖❖ దేవుడు రక్తవర్ణ వస్త్రములు ధరించినప్పుడు ❖❖❖
## (అధ్యాయం 63)

63వ అధ్యాయం ఆరంభంలో ప్రవక్త మరియు దేవునికి మధ్య ఒక రకమైన సంభాషణ జరుగుచున్నది. "రక్తవర్ణ వస్త్రములు ధరించి ఎదోము నుండి వచ్చుచున్న యితడెవడు? శోభితవస్త్రము ధరించినవాడై గంభీరముగా నడచుచు బొస్రా నుండి బలాతిశయముతో వచ్చుచున్న యితడెవడు?" అని యెషయా అడిగాడు (వచనం 1ఎ). అందుకు దేవుడు "నీతినిబట్టి మాటలాడుచున్న నేనే, రక్షించుటకు బలాఢ్యుడనైన నేనే" అని జవాబిచ్చాడు (వచనం 1బి). "అలాగైతే నీ వస్త్రము ఎర్రగా ఉన్నదేమి? నీ బట్టలు ద్రాక్షాగానుగను త్రొక్కుచుండువాని బట్టలవలె ఉన్నవేమి?" అని ప్రవక్త మరొకసారి ప్రశ్నించాడు (వచనం 2). అందుకు దేవుడు "నా ప్రజల శత్రువులను నేను నా ఉగ్రత కొద్దీ నా కాళ్ల క్రింద త్రొక్కివేసితిని. గనుక వారి రక్తము నా వస్త్రములపై చిందినది, మరియు నా బట్టలన్నిటిపై రక్తపు దాగులు పడునట్లు నేను చేసికొంటిని" అని సెలవిచ్చినట్లు అర్థమగుచున్నది (వచనం 3).

ఇక్కడ వాడబడుచున్న భాష అత్యున్నతమైన రూపకాలంకారములో ఉన్నది. వారి శత్రువుల వలన కలుగుచుండిన భయభీతులు మరియు అపాయముల నుండి తన ప్రజలను విడిపించుచూ, దేవుడు తన శక్తిని వ్యక్తము చేయుచున్నట్లు అది చిత్రీకరించుచున్నది. ఎదోము వారికి ప్రతిపక్షమున నిలిచి వారిని ఎదుర్కొనుచుండిన దేశముగా చిత్రీకరింపబడినది. ఎదోమీయులు దేవుని ప్రజలకు ఎల్లప్పుడు విరోధముగా పోరాడుచుండిరి, గనుక ఇశ్రాయేలును ఓడించవలెనని కోరుచుండిన దేశములన్నిటిగూర్చి వివరించుటకు యెషయా వారిని ఇక్కడ ఒక ప్రతీకాత్మకతగా వాడుకొనుచున్నాడు. ఆయన రక్తమునే వస్త్రముగా ధరించియున్నట్లు, లేక ఆయన వస్త్రములు రక్తముతో చిలకరింపబడినవని దేవుడు సెలవిచ్చుచున్నాడు. ఇశ్రాయేలును ధిక్కరించినవారిని ఆయన అణగద్రొక్కుచు, ఆయన వారి శత్రువును ఓడించియున్నాడు. ఆయన తన ఆగ్రహము చేత నేలపై వారి రక్తమును ఒలికింపజేసాడు, రక్తముతో తన వస్త్రములపై మరకలు చేసికొన్నాడు.

రూపకాలంకారముగా నున్న ఈ వ్యక్తీకరణము నుండి మన హృదయాలను స్పృశించు ఒక ప్రశ్న తలెత్తుచున్నది: “దేవుడు ఎర్రని వస్త్రములను ఎప్పుడు ధరిస్తాడు?” దీనినే మరొక విధంగా చెప్పుకొనగోరినట్లయితే, “దేవుడు ఎప్పుడు రక్తసిక్తమై యుంటాడు?” అని మనము అడగవచ్చును. ఈ ప్రశ్నకు లేఖనములు కరుణారసముతో సువిదితమైన సమాధానము నిచ్చుచున్నవి.

*ఆయన తన ప్రజలను రక్షించుటకు వచ్చునప్పుడు ఆయన రక్తవర్ణ వస్త్రములను ధరించును.* ఇది ఈ వాక్యభాగము మనకు నేర్పించుచున్న అత్యంత ప్రాముఖ్యమైన సత్యమై యున్నది. “కోపము కలిగి జనములను త్రొక్కివేసితిని, ఆగ్రహపడి వారిని మత్తిల్లజేసితిని, వారి రక్తమును నేల పోసితిని” అని దేవుడు సెలవిచ్చాడు (వచనం 6). దేవుడు తన ప్రజల శత్రువులను ఎంత క్షుణ్ణంగా నాశనం చేస్తాడో ఈ అలంకారము ప్రముఖంగా ప్రకటించుచున్నది. అంతిమ దశలో, ఆయన వారి రక్తమును నేలపై కుమ్మరించాడు.

దేవుని గూర్చిన ఈ చిత్రీకరణము మనము మర్చిపోకూడని ఒక చిత్రమై యున్నది. ఆయన శక్తిమంతమైన తన బాహువులతో తన ప్రజలను చుట్టుముట్టి యుండును. ఏ దేశముగాని, వ్యక్తి గాని, ఏ విధమైన శక్తిగాని వారికి హానిచేయనేరదు ఆయన తన ప్రజల రక్తముతో కప్పబడునంతవరకు తన ప్రజలను సమీపించుటకు ప్రయత్నించు శత్రువులను దేవుడు తన కాళ్ల క్రింద అణగద్రొక్కును.

*ఇంతేగాక, ఆయన మన పాపములను క్షమించినప్పుడు దేవుడు రక్తవర్ణ వస్త్రములను ధరించును.* ఆయన ఈ పని తన కుమారుడు, యేసు ద్వారా చేసాడు, బహుశా, ఇంకా కొంచెము ఉన్నతమైన స్థాయిలో చూచినట్లయితే, ఈ వర్ణనలో భవిష్యత్తు యొక్క మినుకుమినుకుమను మెరుపు తేటపర్చబడినది. యేసు “పాదముల మట్టుకు దిగుచున్న వస్త్రము ధరించుకొని, రొమ్మునకు బంగారుదట్టి కట్టుకొనియుండెను” అని ప్రకటన 1:13 చిత్రీకరించుచున్నది. అటుతరువాత, ఈ దృశ్యము చాలా భిన్నమైనదిగా ఉంటున్నది. ఆయన ఒక తెల్లని గుర్రముపై

స్వారీ చేయుచున్నట్లు చిత్రీకరింపబడినది. "రక్తములో ముంచబడిన వస్త్రము ఆయన ధరించుకొని యుండెను, మరియు దేవుని వాక్యము అను నామము ఆయనకు పెట్టబడియున్నది. పరలోకమందున్న సేనలు, శుభ్రమైన తెల్లని నారబట్టలు ధరించుకొని, తెల్లని గుఱ్ఱములెక్కి ఆయనను వెంబడించుచుండిరి" అని మనము చదువుచున్నాము (ప్రకటన 19:13, 14).

ఆయన కుమారుడు ఎరుపు వర్ణపు వస్త్రములు ధరించుటకును, రక్తసిక్తమైన రాజవస్త్రములు ధరించుటకును అనుమతించుట దేవుడు మనలను రక్షించుటకు గల ఒకే ఒక మార్గమై యుండినది. దేవుడు మనకు వరముగా అనుగ్రహించిన రక్షణ మూల్యము యిదే, ఆయన మనకు దానిని ఉచితముగా అనుగ్రహించి యున్నాడు. "నీళ్ల ద్వారాను రక్తము ద్వారాను వచ్చినవాడు ఈయనే, అనగా యేసు క్రీస్తే. ఈయన నీళ్లతో మాత్రమేగాక నీళ్లతోను రక్తముతోను వచ్చెను ... ." అని యోహాను యేసును గూర్చి చెప్పాడు (1 యోహాను 5:6). నీళ్లు, రక్తము, మరియు ఆత్మ కాదనబడలేని సాక్ష్యము ఇచ్చుచున్నారని కూడా చెప్పుచున్నాడు: "ఆ సాక్ష్యమేమనగా, దేవుడు మనకు నిత్యజీవమును దయచేసెను, ఈ జీవము ఆయన కుమారునియందున్నది. దేవుని కుమారుని అంగీకరించువాడు జీవము గలవాడు; దేవుని కుమారుని అంగీకరింపనివాడు జీవములేనివాడే" (1 యోహాను 5:11, 12).

*దీనంతటికి అదనంగా, ఆయన మన భారములను వహించునప్పుడు దేవుడు రక్తవర్ణ వస్త్రములను ధరించును.* దమస్కు మార్గములో, యేసు సౌలుకు దర్శనమందు కనబడినప్పుడు, "సౌలా, సౌలా, నీవేల నన్ను హింసించుచున్నావు?" అని అతనిని అడిగాడు (అపొస్తలుల కార్యములు 9:4). ఇటువంటి ప్రశ్న వేయబడినందుకు సౌలు ఏకంగా నివ్వెరపోయాడు, ఏలయనగా అతడు యేసుకు ఏమైనను హాని కలుగజేయుచున్నట్లు అతనికి తెలియలేదు. ఆయనను వెంబడించుచుండినవారిని అతడు తన శాయశక్తులా దృఢనిశ్చయంతో వెంటాడుచుండెను ఏలయనగా వారు శిక్షార్హులైన మతభ్రష్టులనుగా ఆయన వారిని పరిగణించాడు, అంతేగాని అతడు యేసును తాకనైనా లేదు. ఇట్టి తికమకలో, "ప్రభువా, నీవెవడవు?" అని ప్రశ్నించాడు. అందుకు యేసు "నేను నీవు హింసించుచున్న యేసును" అని ప్రత్యుత్తరమిచ్చాడు (అపొస్తలుల కార్యములు 9:5). యేసును వెంబడించుచుండిన వారికి చేసిన ఎటువంటి హానియైనను ఆయనకు చేసినట్లే అను గ్రహింపు సౌలు మనస్సును బహు భయంకరమైన బలముతో తట్టియుండును.

దేవుడు తన ప్రజలకు ఎన్నడును దూరముగా ఉండడు. యేసు క్రీస్తు మానవులమైన మన మధ్య నివసించి మన కష్టసుఖాలను ఆయన అర్థంచేసికొనునట్లు దేవుడు క్రీస్తును పంపాడు ("దేవుడు మనకు తోడు"; మత్తయి 1:23) యేసు యేడు దీపస్తంభముల నడుమ సంచరించెనని ప్రకటన 2:1 మనకు చెప్పుచున్నది. ఈ దీపస్తంభములు సంఘములై యున్నవి; సంఘములు శ్రమనొందినప్పుడు, యేసు వారి మధ్యన సంచరించాడు. శిష్యులు/మనము సర్వలోకమునకు వెళ్లి సమస్త జనులను శిష్యులనుగా చేయవలెననియు, ఆయన వారితో/మనతో కూడ ఉండుననియు యేసు ఆజ్ఞాపించాడు (మత్తయి 28:19, 20). పౌలు తన మిషనెరీ ప్రయాణములపై వెళ్లినప్పుడు, ఆయన సంచరించుచుండిన పట్టణములను విడిచిపెట్టి వెళ్లిపోవలసినదని ఆయన బలవంతము చేయబడ్డాడు మరియు కొన్ని పర్యాయములు కొట్టబడుచు రాళ్లతో రువ్వబడినాడు. ఏది ఏమైనా, పౌలు శరీరములో నుండి ప్రవహించిన ప్రతి రక్తపు బిందువు అది యేసు శరీరములో నుండి కారినదే. కమిలిపోయిన ప్రతి గాయం,

చిరిగిన చర్మం, ఆయన దేహముపై అగుపించిన ప్రతి గాయపుమచ్చ యేసు తన దేహముపై వహించినదే. "నేను యేసు యొక్క ముద్రలు నా శరీరమందు ధరించియున్నాను" అని పౌలు చెప్పాడు (గలతీయులకు 6:17); కానీ "నేను నా శరీరములో నా శిష్యుల ముద్రల ధరించియున్నాను" అని యేసు చెప్పగలిగాడు.

రక్తవర్ణపు వస్త్రములు ధరించియున్న దేవుని గూర్చి మనము ఆలోచించునప్పుడు, "యెహోవా మనకు చేసినవాటన్నిటినిబట్టి యెహోవా కృపాతిశయమును యెహోవా స్తోత్రములను గానము చేతును, తన వాత్సల్యమునుబట్టియు కృపాబాహుళ్యమునుబట్టియు ఇశ్రాయేలు యొక్క వంశస్థులకు ఆయన చూపిన మహా కనికరమును, నేను ప్రకటన చేసెదను" అని చెప్పకుండా మనము ఉండలేము (వచనం 7). దేవుని చూడుము! ఆయన మహిమను మరియు ఆయన గొప్ప మహాత్మ్యమును మించి దానికి అవల ఆయన ధరించియున్న ఎర్రని వస్త్రమును చూడుము – తన ప్రజలను రక్షించు నిమిత్తము ఆయన ధరించిన ఉగ్రత యను రక్తవర్ణపు వస్త్రమును; కెంపు వర్ణపు విమోచన రాజవస్త్రములను; మరియు హతసాక్షుల రక్తసిక్త ఎరుపు డాగులను చూడుము. మనము ఎంత గొప్ప తండ్రిని – రక్తవర్ణపు వస్త్రమును ధరించు తండ్రిని కలిగియున్నాము కదా!